క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట్రాయులు

విజయపురం (నగరి): మండలంలోని చెంగమ నాయుడు కండ్రిగ ఆది ఆంధ్రవాడలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం తహసీల్దార్ వెంకట్రాయులు సివిల్ రైట్స్ డే నిర్వహించారు. చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని సూచనలిచ్చారు. అణగారిన వర్గాల వారి హక్కులు బాధ్యతల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లోకనాథం, సర్పంచ్ దేశమ్మ, సర్వేయర్ శేఖర్, వీఆర్వో జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'ను విజయవంతం చేయండి

శ్రీరంగరాజపురం : పాఠశాలలకు ప్రభుత్వం సోమవారం నుంచి వేసవి సెలవు ప్రకటించిన నేపథ్యంలో విద్యార్థులు వేసవిలో జాగ్రతగా ఉండాలని ఎంఈఓ అరుణాచలం రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండలంలోని తయ్యూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రులకు అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని ప్రభుత్వం వేసవి సెలవుల్లో చేపట్టడం జరిగిందన్నారు. అలాగే ఉపాధ్యాయులు తాము దత్తత తీసుకున్న పిల్లలను వాట్సాప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులచే కేక్ కట్ చేసి మిఠాయిలను అందించారు. సర్పంచ్ వరదమ్మ, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలి

పాలసముద్రం : విద్యార్థులు వేసవి సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలని నీటి బావులు, గుంటల్లో ఈతకు తల్లిదండ్రులతో వెళ్లాలని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ఆముదాల, చలమరాజుఇండ్లు, వనదుర్గాపురం ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

విరివిగా సహకార బ్యాంకు సేవలు



బ్యాంకు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ మనోహర్‌గౌడ్

చిత్తూరు అగ్రికల్చర్ (పెనుమూరు): పెనుమూరులో నిర్మిస్తున్న సహకార బ్యాంకు భవన నిర్మాణ పనులను శనివారం డీసీసీ బ్యాంకు సీఈఓ మనోహర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సహకార బ్యాంకుల సేవలను విస్తరింపజేసి ప్రజలు, రైతులకు మరింత ఆర్థిక సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే బ్యాంకును ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పెనుమూరు సింగిల్‌విండో అధ్యక్షుడు కారేటి గోవిందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచెర్ల చక్రవర్తినాయుడు, పయని, చెన్నకేశవులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లుల చెల్లింపు

వెదురుకుప్పం: ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు ఏపీఓ ఇందు అన్నారు. శనివారం మండలంలోని గొడుగుచింత పంచాయతీ చవనపల్లె సమీపంలోని చెక్‌డ్యామ్ వద్ద గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పూడిక తీత పనులు చేపడుతున్నారు. 60 మంది కూలీలు పనులు చేస్తున్న నేపథ్యంలో శనివారం పనులను ఏపీఓ ఇందు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు రోజుకు రూ.272 గిట్టుబాటు కూలి అందుతోందన్నారు. ఎండలు తగ్గాక పనులు చేస్తే వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

ఘనంగా బలిబండి కూడు



అమ్మపల్లి వద్ద బలి బండి కూడు తీసుకొస్తున్న భీముని వేషధారి

కార్వేటినగరం: అమ్మపల్లి పాయకట్టులో కృష్ణాపురం జలాశయం సమీపంలో వెలసిన శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వారి వార్షిక మహా భారత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం బలి బండి కూడు ఉత్సవం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భీముని వేషధారి ఎడ్ల బండిపైకి ఎక్కి బకాసురునికి బండి కూడు తీసుకెళ్లే ఘట్టం ఆహుతులను అలరించింది. అలాగే ద్రౌపదీ అమ్మవారితో పాటు భీమ, అర్జున, నకుల, సహదేవులు, శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

సైబర్ మోసాలపై అవగాహన

పాలసముద్రం : సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని ఎస్ఐ సురేష్ తెలిపారు. శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన సిబ్బందితో సమీక్షించారు. గ్రామాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఏఎస్ఐ చక్రవర్తి, మురుగేష్, పోలీస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు సువర్ణావకాశం

గత పాలనలో క్రీడలకు తగిన ప్రోత్సాహం లేకపోవడంతో పోటీలు జరిగేవి కావు. దీంతో క్రీడామైదానాలు కూడా క్రీడాకారులు లేక వెలవెలబోయి నిర్జీవంగా కనిపించేవి. క్రీడల్లో చూపే ప్రతిభ ద్వారా పొందే సర్టిఫికెట్లు క్రీడాకారులకు వివిధ విద్యాకోర్సుల్లో సీట్లు పొందడంలో, ఉద్యోగాలు పొందడంలో ఉపయోగపడేవి. కానీ వారికి అది అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన ఈ నాలుగేళ్లలో క్రీడలకు పెద్దపీట వేస్తూ వస్తోంది. క్రీడల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

- క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రప్రభుత్వం
- నిత్యం క్రీడల నిర్వహణలో యంత్రాంగం
- తాజాగా రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రికెట్ క్రీడాకారులకు ఉచిత శిక్షణ
- నేడు జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు



క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

నగరి : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. నిత్యం రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో క్రీడాపోటీలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో పాటు రోజా చారిటబుల్ ట్రస్టు ప్రతిభ ఉన్నవారికి క్రీడల్లో ఉచిత శిక్షణ అందించడంతో పాటు వారికి అన్ని సౌకర్యాలు కల్పించి వారి ప్రతిభను మెరుగు పరుస్తోంది. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి అంటూ క్రీడాకారులు పాల్గొనేలా నైపుణ్యం గల కోచ్‌లతో తర్ఫీదు ఇప్పిస్తోంది. దీంతో నిర్జీవమైన క్రీడామైదానాలు ప్రస్తుతం క్రీడాకారులతో కళకళలాడుతున్నాయి. క్రీడాకారులు లయ బద్ధంగా చేస్తున్న చప్పుడుతో క్రీడోత్సాహం తరంగంలా ఎగిసి పడుతోంది. సంతోష వీచికలతో శిక్షణ శిబిరాలు సుమధుర సౌరభాలు వెదజల్లుతున్నాయి. వేసవి సెలవుల్లో క్రికెట్‌లో జిల్లాస్థాయికి ఎంపిక కావడంతో పాటు శిక్షణ కూడా ఉచితంగా పొందనుండడంతో క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక..

రోజా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-16, అండర్-19 క్రికెట్ పోటీలకు ఆదివారం క్రీడాకారుల ఎంపిక జరగనుంది. స్థానిక కేవీకే క్రీడామైదానంలో నిర్వహించే పోటీల ద్వారా క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఇలా ఎంపిక చేసిన వారికి క్రికెట్ శిక్షణా శిబిరంలో ఉచిత శిక్షణ అందించనున్నారు. శిక్షణ అనంతరం జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో వీరు పాల్గొంటారు. అనంతరం వారి ప్రతిభను అనుసరించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుంది. అన్ని వసతులతో నైపుణ్యం కలిగిన శిక్షకులు ఉండడంతో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. శనివారం శిక్షణ అందించడానికి కావలసిన ఏర్పాట్లు మైదానంలో వేగంగా చేపట్టారు.

ఇది సదావకాశం..



జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక, శిక్షణ కార్యక్రమం విద్యార్థులకు దక్కిన సదావకాశం. ఎంపికైన వారికి అత్యుత్తమ శిక్షణ అందిస్తాం. రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా శిక్షణకు సంబంధించిన క్రికెట్ నెట్, నెట్‌ప్రాక్టీస్‌కు తగిన విధంగా మైదానాన్ని సిద్ధం చేశాం. శిక్షణ పొందిన క్రీడాకారులు భవిష్యత్తులో తప్పక రాణిస్తారు.

– బాబు, శాప్ కోచ్

ఈ ప్రోత్సాహం ఎన్నడూ లేదు



క్రీడలకు ఇంతటి ప్రోత్సాహం ఎన్నడూ లేదు. మంత్రి ఆర్కేరోజా క్రీడలపట్ల ప్రత్యేక చొరవ చూపుతున్నారు. నియోజకవర్గ పరిధిలో గత నాలుగేళ్లగా జరుగుతున్న క్రీడాపోటీలు, వేసవి శిక్షణా శిబిరాలు, క్రీడాకారులకు చారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహం ఇవే ప్రత్యక్ష సాక్ష్యాలు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు, రెండు రోజుల పాటు క్రికెట్ మ్యాచ్‌లు క్రీడాకారులను ఉత్తేజ పరచనున్నాయి.

– యాదవేంద్రరెడ్డి, డైరెక్టర్, శాప్

ఆలయ ఆక్రమణల తొలగింపు



పుత్తూరు రూరల్: స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం చుట్టూ ఉన్న ఆక్రమణలను శనివారం దేవదాయశాఖ అధికారులు తొలగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.మునికృష్ణయ్య మీడియాతో మాట్లాడుతూ ఆలయం చుట్టూ కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు వారు 2019లో దేవస్థానం స్థలాన్ని ఖాళీ చేయాలని ఆక్రమణదారులను ఆదేశించిందని తెలిపారు. ఈ ఉత్తర్వుల మేరకు కొందరు స్వచ్ఛందంగా ఖాళీ చేశారని తెలిపారు. మిగిలిన వారిని శనివారం ఖాళీ చేయించి ఆలయ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సీఐ లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ రమేష్‌బాబు సమక్షంలో ఆక్రమణలు తొలగించినట్లు తెలిపారు.

నేడు ఆరాధన మహోత్సవం

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీగోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం 330వ ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వీకే మురళి ఆచారి తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు గోపూజ, 8 గంటలకు మహాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు.

భావనారాయణస్వామి సేవలో మంత్రి రోజా



భావనారాయణ స్వామి ఆలయంలో మంత్రి రోజా

నగరి : బాపట్ల జిల్లాలోని సత్యనారాయణపురంలో వెలసిన క్షీర భావనారాయణ స్వామిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి వెళ్లిన ఆమెకు ఆలయ ప్రధాన అర్చకులు, పాలకమండలి సభ్యులు స్వాగతం పలికారు. వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయంలో మంత్రి భావనారాయణ స్వామిని, చెన్నకేశవ స్వామిని, విగాభోగయోగ స్వామిని దర్శించుకున్నారు. ఆమె వెంట స్థానిక ఎమ్మెల్యే కోన రఘుపతి, పార్లమెంటు సభ్యులు నందిగామ సురేష్ పాల్గొన్నారు.

సమాన అభివృద్ధే మా లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

నగరి : అన్నివార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. శనివారం నగరి మున్సిపల్ కార్యాలయంలో ఆయన సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సమావేశ అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. అభ్యంతరాలు లేవని సభ్యులు అజెండాను ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ అన్ని వార్డుల్లో ప్రాధాన్యతా ప్రాతిపదికన సమానంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఏవైనా ఇతర సమస్యలుంటే చెప్పాలన్నారు. దీనిపై కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ కీళపట్టు శివారుల్లో ఉన్న టైర్ల బర్నింగ్ ఫ్యాక్టరీ కారణంగా కాలుష్యం అధికంగా వ్యాపిస్తోందన్నారు. సమీపంలో జగనన్న కాలనీ ఉందని 1267 నివాసాలు అక్కడ నిర్మిస్తున్నామని ఆ ప్రాంతంలో కలుషిత ఫ్యాక్టరీ ఉండకూడదని దానిని నిషేధించాలని కోరారు. ఇతర కౌన్సిలర్లు కూడా ఈ అంశంపై ఏకీభవించారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ అధికారులు ఆ ఫ్యాక్టరీని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్లు వెంకటరత్నం, బాలన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ శేఖర్, టీపీఓ నీరజాక్షి, మెప్మా అధికారి సునీత, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లె గ్రామంలో తిరుపతి నారాయణాద్రి హాస్పిటల్, హియరింగ్ సొల్యూషన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఇందులో 95 మంది రోగులను పరీక్షించారు. ప్రధానంగా రక్తపోటు, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు, వినికిడి లోపాలను గుర్తించి వ్యాధుల నివారణకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా విభాగం ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు అవసరమైన సేవలు అందజేస్తున్నట్లు కళాశాల చైర్మన్ మన్నెంరామిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శశికుమారి, పిన్సిపల్ జయచంద్ర, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మన జెండానే ప్రజలకు అండ



జగనన్నే మా భవిష్యత్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

నగరి : మనం మోసిన జెండానే ప్రజలకు అండగా ఉంటోందని మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాల ముగింపును పురస్కరించుకుని శనివారం ఆయన మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నగరి టాప్‌లో నిలిచి 28 స్థానం సాధించడమే కాకుండా 65వేల మిస్డ్ కాల్స్ రావడం కార్యాచరణకు నాయకులు పడిన కష్టానికి ఫలితం అన్నారు. 2024 ఎన్నికల్లో 175 స్థానాలను కైవసం చేసుకోవడం తథ్యమన్నారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సాధించిన ప్రగతిని చూపే పోస్టర్లను ఆయన విడుదల చేసి పార్టీశ్రేణులకు అందించారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, ఎంపీపీలు మునివేలు, దీప, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహిన్, తెలుగు సాహిత్యఅకాడమీ డైరెక్టర్ జయశ్రీ, శాప్ డైరెక్టర్ యాదవేంద్ర రెడ్డి, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

పుత్తూరు రూరల్: ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజలతో మమేకం కావాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి సూచించారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ 1వ వార్డులోని కట్టకింద రామకృష్ణాపురం, కొత్తతిమ్మాపురం గ్రామాల్లో పర్యటించారు. సాయంత్రం 15వ వార్డు రామారావు, రామానాయుడు కాలనీలు, తిరుపతి రోడ్డులో పర్యటించి ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కమిషన్ కేఎల్ఎన్‌రెడ్డితో చర్చించి సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కుమారస్వామిరెడ్డిని 15వ వార్డు నాయకుడు సీఎం దిలీప్ మొదలి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, కౌన్సిలర్లు గుణశేఖర్‌రెడ్డి, భానుమతి, ఏకాంబరం, నాయకులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్‌రెడ్డి, జనార్దన్ యాదవ్, లక్ష్మణమూర్తి, నారాయణస్వామి, కుమార్‌రెడ్డి, చక్రి పాల్గొన్నారు.



కుమారస్వామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ పథకాల అమలుతో ఆర్థికాభివృద్ధి

- ప్రజల సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయం
- పథకాల అమలుతో ప్రతి గడపలో ఆనందం కనిపిస్తోంది
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఎల్లాపల్లి ఎస్సీకాలనీలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: చిన్నారుల దగ్గర నుంచి పండు ముసలి వాళ్ల వరకు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండలంలోని ఎల్లాపల్లి గ్రామ సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరు చేయనివారికి ఇళ్లు, ఇంటి పట్టాలు ఇవ్వని వారికి ఇంటి పట్టాలు, రెవెన్యూ పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తోందని, అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలకు నగదు, విద్యార్థులను పాఠశాలకు పంపితే అమ్మఒడి, మధ్యాహ్నభోజనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు పెట్టుబడి కోసం రైతు భరోసా, స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణ మాఫీ, సున్నావడ్డీతో రుణాలు, అణగారిన వర్గాలకు వైఎస్సార్ చేయూత, వృద్ధులకు, వికలాంగులకు వితంతువులకు పింఛన్ అందించి ఆదుకుంటున్నారని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు..

ప్రజలకు ప్రభుత్వ సేవలు అందాలన్న ఉద్దేశంతో గ్రామసచివాలయాలను, వలంటీర్ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు పొందేలా చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనితారెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమరెడ్డి, రైతుభరోసా అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు అంబోదరపల్లి బాబురెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, సర్పంచ్ జాయ్‌ఎలిజబెత్, ఎంపీటీసీ లారెన్స్, ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దారు ఇన్బనాథన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉత్తమ ఫలితాలు సాధించండి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పుత్తూరు రూరల్: ప్రభుత్వ లక్ష్యం దిశగా ఉపాధ్యాయులు మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కె.మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీయూపీ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అమ్మఒడి, జగనన్న విద్యాకానుక వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటిని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని కోరారు. ఆటల పోటీల్లో గెలుపొంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ హెచ్ఎం సుబ్రమణ్యం ఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీకాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: ప్రమాదకర వ్యాధులను నియంత్రించడంలో టీకాలు ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం టీకా వారోత్సవాలను పురస్కరించుకుని టీకా ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్, మశూచి, పోలియో వంటి వ్యాధుల నియంత్రణలో టీకా ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. ప్రతిఒక్కరూ టీకాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శాంసన్‌రాజు, స్వాతి, వెంకటకృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

పుత్తూరు రూరల్: స్థానిక మంచినీళ్ల బావి వీధిలో శనివారం సాయంత్రం ఓ పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ 8 మందిని గాయపరిచింది. గాయపడిన వారిలో ముగ్గురు మహిళలతో పాటు ఓ వృద్ధురాలు ఉంది. గాయపడిన వారంతా చికిత్స నిమిత్తం వివిధ ఆస్పత్రులకు పరుగులు తీశారు. కుక్క దాడి సందర్భంగా మున్సిపాలిటీ వారికి సమాచారం అందించినా స్పందించలేదని స్థానికులు ఆరోపించారు. పట్టణంలోని ప్రతి వీధిలో కుక్కలు పెద్దసంఖ్యలో తిరుగుతూ పలువురిని గాయపరుస్తున్నాయని తెలిపారు. కుక్కలను పట్టి అటవీ ప్రాంతంలో వదలి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించండి



జగనన్నే మా నమ్మకం కార్యక్రమంలో కృపాలక్ష్మి

కార్వేటినగరం: రాష్ట్రంలో మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎంఎం విలాశం సచివాలయ పరిధిలో ఉన్న గుండుగాని దళితవాడ, కనకమ్మ కండ్రిగ, ఎస్ఆర్ కండ్రిగ, కుమ్మరగుంట ఒడ్డిండ్లు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్– మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ శేఖర్‌రాజు, జిల్లా కార్యదర్శి బాలాజీతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వం చేసిన మోసాలను గుర్తు చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించి, వారి అనుమతి మేరకు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను గుమ్మాలకు అంటించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, సర్పంచ్‌లు ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం వెంటే పయనం

కార్వేటినగరం: మండలంలోని అన్నూరులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని అన్నూరు సర్పంచ్ సుందర్‌రాజ్(ఆదామ్) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం, నియోజకవర్గం అభివృద్ధి కోసం తపిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి నన్ను దూరం చేసేందుకు కొన్ని ఎల్లో మీడియా పత్రికలు ప్రతిపక్ష నాయకులతో కలసినట్లు అవాస్తవ కథనాలను ప్రచురించి విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. తన సోదరుడు డాక్టర్ థామస్‌ను తమ కుటుంబంలో జరిగే శుభకార్యానికి ఆహ్వానించడానికి మాత్రమే వెళ్లానన్నారు. తప్పుడు కథనాలు రాస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

జనం నినాదం.. జగనన్నే మా నమ్మకం

పాలసముద్రం : మండలంలోనిశ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఉపాధిహామీ పనులు పెంచాలి



బహిరంగ సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

వడమాలపేట : మండలంలో ఉపాధి పనులను పెంచి కూలీలను ప్రోత్సహించాలని ఉపాధిహామీ పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలో 2020–21 సంవత్సరంలో జరిగిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో అన్ని రకాల ఉద్యాన పంటలు సాగు చేయడానికి ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. అనంతరం మండలంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ వివరాలు వివరించారు. 15వ విడత సామాజిక తనిఖీలో మండలంలో మొత్తం రూ.10.18 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని, ఇందులో ఈజీఎస్ పనులపై రూ.5805, సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా చేసిన పనుల్లో రూ.33145 రికవరీ చేయాలని ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ అరుణ, అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్మోహన్, సహాయ సంచాలకులు సరిత, ఏపీఓ సుజాత, ఏఈపీఆర్ నరసింహులు, ఎస్ఆర్పీ బుజ్జి, ఈసీ మురళీకృష్ణ, ఎంపీటీసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వేడుకగా ప్రసన్న వేంకటేశ్వరుడి గ్రామోత్సవం



పుర వీధుల్లో దర్శనమిస్తున్న స్వామివారు

వడమాలపేట : అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవను ఆలయ అధికారులు శనివారం వేడుకగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం సర్వదర్శనానికి భక్తులను అనుమతించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని స్వర్ణాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వఅలంకార భూషితుడైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామిని మంగళవాయిద్యాలు నడుమ తిరుమాడవీధుల్లో ఊరేగించారు. వేసవి సెలవులు కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది.